సాక్షి
సంగారెడ్డి
బుధవారం । 5 । ఫిబ్రవరి । 2025



కల్లు తిప్పకోలేని తాటివనాలు

ప్రత్యేక తాటివనాలు పచ్చని పొలాల మధ్యలో ఉండటంతో కల్లు ప్రియులను ఆకట్టుకుంటున్నాయి.

వివరాలు 8లో ▸



ఇదేం రైతు 'శిక్ష'ణ?

దుబ్బాక: లచ్చపేటలో రైతు శిక్షణ కేంద్రం పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ అర్ధాంతరంగా వదిలేయడంతో అసంపూర్తిగానే దర్శనమిస్తోంది.

వివరాలు 8లో ▸



తారు మరిచారు!

అందోల్ నియోజకవర్గంలోగుత్తేదారు రోడ్లను తవ్వి కంకరతో చదును చేసి.. తారు వేయకుండా పనులను మధ్యలోనే ఆపేశారు.

వివరాలు 9లో ▸

చెరువుల విధ్వంసం

- ఫీడర్లను మూసి.. కాలువలను ఖతం చేసిన వైనం
- మైనింగ్ మాఫియా అక్రమాలపై ఇరిగేషన్ నివేదిక
- ఎన్జీటీ ఆదేశాలతో ఆయా శాఖల సంయుక్త తనిఖీలు
- జిన్నారం మండలంలో వెలుగులోకి ఆగడాలు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: జిన్నారం మండలంలో మైనింగ్ మాఫియా చేసిన చెరువుల విధ్వంసంపై నీటిపారుదలశాఖ నివేదిక తయారు చేసింది. అక్రమ మైనింగ్ తవ్వకాలతో ఐదు చెరువులు ఏకంగా ఆనవాళ్లను కోల్పోయినట్లు తేల్చింది. మరికొన్ని చెరువులు కూడా ధ్వంసమైనట్లు గుర్తించింది. ఇక్కడ మైనింగ్ కార్యకలాపాలు అడ్డూ అదుపు లేకుండా సాగుతున్నాయి. కొన్ని చెరువుల కాలువలు ధ్వంసమైనట్లు గుర్తించారు. కొన్నింటి తూములు, కట్టలు సైతం దెబ్బతిన్నట్లు తేల్చారు. చిల్ఖాన్‌చెరువు (శివనగర్), పెద్దచెరువు (రాళ్లకత్వ), అంతాయికుంట (సోలక్‌పల్లి), చాకలికుంట (రాళ్లకత్వ) తదితర చెరువులకు తీవ్రంగా నష్టం జరిగినట్లు నివేదికలో పేర్కొన్నారు. ఈ చెరువులకు జరిగిన నష్టానికి సంబంధించి పూర్తి నివేదికను ఇటీవల ఆ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపారు.

అధికారుల క్షేత్రస్థాయి తనిఖీలు..

నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ ఆదేశాల మేరకు సంబంధిత శాఖల జిల్లా ఉన్నతాధికారులు ఇటీవల ఈ మైనింగ్ కార్యకలాపాలు జరుగుతున్న ప్రాంతంలో సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. నీటిపారుదల శాఖతో పాటు, రెవెన్యూ, మైనింగ్ తదితర శాఖల ఉన్నతాధికారుల బృందం ఈ మైనింగ్ కార్యకలాపాలు సాగుతున్న ప్రాంతాన్ని క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అక్కడికి వెళ్లి చూసిన అధికారులకు కళ్లు బైర్లు కమ్మే అక్రమాలు వెలుగు చూశాయి. మైనింగ్ మాఫియా ధనదాహానికి ఏకంగా చెరువుల ఆనవాళ్లే కోల్పోయే పరిస్థితి నెలకొంది. ఈ మైనింగ్ వాహనాల రాకపోకలతోపాటు, తవ్వకాల కోసం అడ్డుగా ఉన్నాయని కాలువలను తవ్వేసి రోడ్లేసినట్లు తేలింది. చెరువుల్లోకి నీళ్లు చేరకుండా ఫీడర్ ఛానళ్లను పూర్తిగా మూసివేసినట్లు గుర్తించారు. తూములు, కట్టలను సైతం బలహీనంగా చేసినట్లు తేలింది.

బిహార్ గుండాలతో బెదిరింపులు...

మైనింగ్ మాఫియా ఎంతకు బరితెగించిందంటే.. క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లిన ఆయా శాఖల అధికారులకు బిహార్ తదితర ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన గుండాలతో బెదిరింపులకు దిగడం గమనార్హం. దీంతో క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లిన ఆయాశాఖల ఉన్నతాధికారులే ఒకింత ఆందోళనకు గురి కావాల్సి వచ్చింది. రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిన్నారం మండలంలో చెరువులకు జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు పరిశీలనకు వెళ్లామని నీటిపారుదలశాఖ అధికారులు 'సాక్షి'తో పేర్కొన్నారు. ఈ మేరకు నివేదికను ఉన్నతాధికారులకు పంపామని చెప్పారు.

ఎన్జీటీని ఆశ్రయించిన గ్రామస్తులు

ఈ మండలంలో మైనింగ్ మాఫియా భారీగా అక్రమ తవ్వకాలను చేపట్టింది. ఈ క్వారీలన్నీ ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతల బినామీలవే కావడంతో ఈ అక్రమాలకు అడ్డే లేకుండా పోయింది. రాత్రీ పగలు తేడా లేకుండా సాగుతున్న ఈ అక్రమ మైనింగ్‌తో తమ జీవన విధానమే విధ్వంసం అవుతోందని ఆయా గ్రామాల వాసులు కొన్నేళ్లుగా పోరాటం చేస్తున్నారు. ఈ అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలని పలుమార్లు సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు, ప్రజావాణిలోను వినతిపత్రాలు అందజేసినా అవన్నీ బుట్టదాఖలయ్యాయే తప్ప ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో ఆయా గ్రామాల్లోని బాధితులు కొందరు నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్‌ను ఆశ్రయించారు.

ఎమ్మెల్సీ ఓటర్ల సంఖ్య 71,622

ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ

- పెరగనున్న ఓటర్లు!
- మార్చి 8 వరకు కోడ్ అమలు



జిల్లాల వారీగా పట్టభద్రుల ఓటర్లు, పోలింగ్‌స్టేషన్లు

జిల్లా	స్త్రీలు	పురుషులు	మొత్తం	పోలింగ్ స్టేషన్లు
సంగారెడ్డి	6,765	14,437	21,202	40
మెదక్	3,420	8,533	11,953	22
సిద్దిపేట	10,624	20,922	31,546	40

జిల్లాల వారీగా ఉపాధ్యాయుల ఓటర్లు, పోలింగ్‌స్టేషన్లు

జిల్లా	స్త్రీలు	పురుషులు	మొత్తం	పోలింగ్ స్టేషన్లు
సంగారెడ్డి	1,103	1,485	2,588	28
మెదక్	515	766	1,281	21
సిద్దిపేట	1,104	1,948	3,052	23

సంగారెడ్డి జోన్: ఉమ్మడి మెదక్–కరీంనగర్–నిజామాబాద్–ఆదిలాబాద్ జిల్లాలతో కూడిన పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు నగారా మోగింది. ఇందుకు సంబంధించి భారత ఎన్నికల సంఘం సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇప్పటికే ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు వేసేందుకు ఓటరు జాబితాతో పాటు పోలింగ్ కేంద్రాలను గుర్తించి, గతేడాది డిసెంబర్ 30న తుది జాబితాను సిద్ధం చేసిన సంగతి తెలిసిందే.

మార్చి 8 వరకు కోడ్

మండలి ఎన్నికల కోడ్ అమలు మార్చి 8 వరకు అమలు చేయనున్నట్లు ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. కోడ్ ముగిసే వరకు ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల సంఘం నియమ నిబంధనల మేరకే ప్రచారం చేసుకోవాల్సి ఉంటుంది. ఎన్నికలు కొనసాగే జిల్లాల్లో కోడ్ అమల్లో ఉండటంతో కొత్త పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసేందుకు అవకాశం లేదని ఎన్నికల సంఘం ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొంది.

ఎన్నికల నిర్వహణకు కసరత్తు

ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఆయా శాఖల అధికారులు ఇప్పటికే కసరత్తు ప్రారంభించారు. జిల్లా ఎన్నికల అధికారిగా జిల్లా కలెక్టర్, ప్రతీ జిల్లాలో ఆర్డీవోలు అసిస్టెంట్ ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తారు. సంగారెడ్డి జిల్లాలో నలుగురు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఉన్నారు. అదేవిధంగా మండలాల వారీగా అధికారులను కేటాయించే పని కొనసాగుతోంది.

ఇదీ షెడ్యూల్

ఈ నెల 3న ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల కాగా, అదేరోజు నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల దాఖలుకు అవకాశం కల్పించింది. 11న నామినేషన్ పత్రాలు పరిశీలన, 13వ తేదీ వరకు వాటి ఉపసంహరణకు గడువు విధించింది. ఉపసంహరణ అనంతరం పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నారు. ఈనెల 27న ఉదయం 8:00 గంటల నుంచి సాయంత్రం 4:00 గంటల వరకు పోలింగ్ నిర్వహించనుంది. మార్చి 3న ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టనుంది.

కరీంనగర్‌లో నామినేషన్ దాఖలు

పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలో పోటీ చేసే అభ్యర్థులు కరీంనగర్‌లోని కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ దాఖలు చేయాల్సి ఉంటుంది. ఎమ్మెల్సీ ఎన్నిక బ్యాలెట్ పేపర్ విధానంలో నిర్వహించనున్నారు.

174 పోలింగ్ స్టేషన్లు

గతేడాది డిసెంబర్ 30న విడుదల చేసిన తుది ఓటరు జాబితాలో ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా 71,622 మంది ఉపాధ్యాయ పట్టభద్రుల ఓటర్లు ఉన్నట్లు గుర్తించారు. అదేవిధంగా 174 పోలింగ్ స్టేషన్లు ఉన్నట్లు గుర్తించారు. ఈ సంవత్సరం జనవరి 1 నుంచి 31 వరకు ఓటు వేసేందుకు మరో అవకాశం కల్పించారు. దీంతో దరఖాస్తు చేసుకున్న వారితో మరింతగా ఓటర్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. పెరిగిన ఓటర్ల సంఖ్యతోపాటు ఓటర్ల జాబితాను ఈనెల 7న ప్రకటించనున్నారు.

నాగల్‌గిద్దలో కందుల కొనుగోలు కేంద్రం

సాక్షి ఎఫెక్ట్



కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఏడీఏ నూతన్‌కుమార్

నారాయణఖేడ్: నాగల్‌గిద్ద మండలంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏడీఏ నూతన్ కుమార్ మంగళవారం ప్రారంభించారు. 'సాక్షి'దినపత్రికలో 'కంది..కొనరేంది?'శీర్షికన ప్రచురితమైన కథనానికి మార్క్‌ఫెడ్ అధికారులు స్పందించారు. మంగళవారం నాగల్‌గిద్ద మండలంలో ప్రారంభించారు. ఈ మండలంలోని సక్రునాయక్ తండా వద్ద గల నాగల్‌గిద్ద రైతు ఉత్పత్తిదారుల సంఘం గోడౌన్‌లో కొనుగోళ్లను చేపట్టనున్నారు. ఆన్‌లైన్‌లో పేర్లు ఉన్న రైతులు తమ పంట ఉత్పత్తులను కేంద్రానికి తీసుకు వచ్చి మద్దతు ధరకు కందులను విక్రయించాలని ఏడీఏ సూచించారు. కార్యక్రమంలో ఏవో ప్రవీణ్, ఏఈవో సంతోశ్, సంఘం డైరెక్టర్లు బీగాబాయి పాల్గొన్నారు.

పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియెట్, పదవ తరగతికి సంబంధించిన పరీక్ష ఫీజు చెల్లింపు గడువు తేదీని పొడిగించినట్లు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. అపరాధ రుసుం రూ.50తో ఈ నెల 10 వరకు గడువు ఉండగా, ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు తత్కాల్‌లో ఫీజు చెల్లించేందుకు గడువు పొడిగించినట్లు తెలిపారు. పదవ తరగతికి ప్రతీ సబ్జెక్టుకు రూ.100 (థియరీ), ప్రాక్టికల్‌కు రూ.100, ఇంటర్మీడియెట్‌కు ప్రతీ థియరీ సబ్జెక్టుకు రూ.150 కాగా ప్రాక్టికల్‌కూ అంతేమొత్తాన్ని నిర్దేశించారు. ఫీజును మీసేవ లేదా, టీఎస్ ఆన్‌లైన్ ద్వారా మాత్రమే చెల్లించాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా సమన్వయకర్త వెంకటస్వామి 80084 03635ను సంప్రదించాలని తెలిపారు.

ధరణి దరఖాస్తుల ప్రక్రియ వేగవంతం

కలెక్టర్ వల్లూరు క్రాంతి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి జోన్: ధరణి దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేయడంతోపాటు మీసేవలో పెండింగ్ అప్లికేషన్స్‌ను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే ల్యాండ్ రికార్డు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు తన వద్దకు రాకూడదని స్పష్టం చేశారు. అధికారుల పనితీరుపై నిరంతరం నిఘా పెట్టామని, ప్రతీ అధికారి పనితీరు ఫీడ్‌బ్యాక్ తన వద్ద ఉందని తెలిపారు. సక్సేషన్, పెండింగ్ మ్యుటేషన్ వంటి దరఖాస్తులను, అవసరమైన రికార్డులను ఆర్డీవో స్థాయిలో పూర్తిగా పరిశీలించిన తర్వాతే కలెక్టరేట్‌కు పంపించాలని సూచించారు. మీసేవ దరఖాస్తులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీలో అలసత్వం వద్దని చెప్పారు. చెరువులు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హెచ్‌ఎండీఏ పరిధిలో 675 చెరువులకు సంబంధించిన డిజిటల్ మ్యాపులు సిద్ధం చేయాలన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్లు, చంద్రశేఖర్, మాధురి, ఏడీ సర్వే ల్యాండ్ అధికారి అవినాశ్ నాయక్, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, ఈ ఈ ఇరిగేషన్ తదితరులు పాల్గొన్నారు.

ఆడ పిల్లలను నిర్లక్ష్యం చేయవద్దు



ఆశ వర్కర్లు, ఇతర సిబ్బందితో జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి

న్యాల్‌కల్(జహీరాబాద్): ఆడ పిల్లలను నిర్లక్ష్యం చేయవద్దని వారిని కూడా మగపిల్లలతో సమానంగా చూడాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి సూచించారు. న్యాల్‌కల్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆమె మొక్కలు నాటారు. అనంతరం 'బేటీ బచావో–బేటీ పడావో'అంశంపై వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...గ్రామీణ ప్రాంతాల్లోని అధిక శాతం ఆడ పిల్లలను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు ఉంటాయని ఆమె హెచ్చరించారు. అనంతరం స్థానిక కేజీబీవీలో బేటీ బచావో–బేటీ పడావో అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు హైమావతి, అమృత్‌రాజ్, హెల్త్ సూపర్ వైజర్ మార్తా, సిబ్బంది గోపిరాజ్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌లను నమ్మిమోసపోవద్దు



ప్రచారం నిర్వహిస్తున్న గోదావరి, నాయకులు

బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి

సదాశివపేట(సంగారెడ్డి): కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మాటలు నమ్మి మోసపోవద్దని పట్టభద్రుల బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి కోరారు. అంజిరెడ్డి తరపున గోదావరి బీజేపీ నాయకులు మంగళవారం పట్టణంలోని ఆయా విద్యాసంస్థల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. బీజేపీకి కార్యకర్తల బలం బూత్‌స్థాయి నుంచి ఉందని, ఎన్నికల్లో బీజేపీ హామీ ఇచ్చిన అమలు చేస్తుందన్నారు. ఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా ప్రభుత్వ పాఠశాల్లో మరుగుదొడ్లు, ఫర్నీచర్, ల్యాబ్ పరికరాలు, కంప్యూటర్లు, టోర్నమెంట్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ కన్వీనర్ సంగమేశ్వర్, బీజేపీ నాయకులు రాజేశ్వర్‌రావుదేశ్ పాండే, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బిలాల్‌పూర్‌లో పాతపంటల జాతర

జహీరాబాద్: కోహీర్ మండలంలోని బిలాల్‌పూర్ గ్రామంలో పాతపంటల జాతరను ఘనంగా నిర్వహించారు. గొటిగార్‌పల్లి నుంచి బిలాల్‌పూర్ చేరుకున్న సందర్భంగా ఎడ్లబండ్ల జాతరకు మంగళవారం గ్రామస్తులు, రైతులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో డీడీఎస్ సభ్యులు, రైతులు, శాస్త్రవేత్తలు మాట్లాడుతూ...చిరుధాన్యాల ఆహారమే ఆరోగ్యానికి సంజీవనిలాంటిదన్నారు. ప్రతీ రైతు తనకున్న పొలంలో ఎంతోకొంత మేర చిరుధాన్యాలు సాగుచేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ శాస్త్రవేత్త కైలాశ్, రైతులు, సునీత, డీడీఎస్ ప్రతినిధులు వినయ్‌కుమార్ చిరు ధాన్యాల ప్రాధాన్యత గురించి వివరించారు. సమావేశంలో మంజుల, చుక్కమ్మ, విజయలక్ష్మి, నర్సమ్మ, లక్ష్మమ్మ, చంద్రమ్మ, లయ, ప్రహ్లాద్, నర్సింహులు, బాలయ్య పాల్గొన్నారు.

తక్కువ రేట్లకే అల్పాహారం అందించాలి

సీఐటీయూ

సంగారెడ్డి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లో అల్పాహారాన్ని తక్కువ రేట్లకే అందించాలని సీఐటీయూ జిల్లా నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్‌కుమార్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎం.యాదగిరి మాట్లాడుతూ...సంగారెడ్డి పట్టణంలో ప్రభుత్వ హాస్పిటల్‌లో ఇటీవల ఇందిరమ్మ మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభించారని, కానీ క్యాంటీన్ యాజమాన్యం అధిక రేట్లు అమ్మడంతో ఇక్కడికి వచ్చిన ప్రజలు, కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఆసుపత్రిలో క్యాంటీన్ నడుపుతున్న యాజమాన్యానికి రూమ్ అద్దె, కరెంట్ బిల్లు చెల్లించనవసరంలేదని, వారు మాత్రం అల్పాహారాన్ని రూ.40కు, టీని రూ.15కు అమ్ముకుంటూ పేదలను ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి క్యాంటీన్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు రాజు, కార్యదర్శి,ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు



వైకుంఠపురంలో రథయాత్రలో పాల్గొన్న భక్తులు

పంచవటిలో...

న్యాల్‌కల్ (జహీరాబాద్): రాఘవాపూర్–హుమ్నాపూర్ గ్రామాల శివారులోని పంచవటిలో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీసూర్య భగవానుని ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు, ఆలయం ఆవరణలో యజ్ఞాలు, వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవాలకు భక్తులు భారీగా హాజరై మంజీర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు చేశారు.

సంగారెడ్డిలో...

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డిలోని శివాలయంతో పాటు పట్టణ శివారులోని వైకుంఠపురంలో మంగళవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శివాలయం నుంచి సోమేశ్వరవాడలోని శివాలయం వరకు శివస్వాముల విగ్రహాలను ఊరేగించారు. ఈ వేడుకలకు భారీగా మహిళలు, భక్తులు హాజరయ్యారు.



ఎల్లమ్మ చల్లగా చూడమ్మా!

పటాన్‌చెరుటౌన్: పటాన్‌చెరు మండలం రామేశ్వరంబండ గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి జాతర ఘనంగా నిర్వహించారు. ఈ జాతరకు మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు సుధారాణి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆమెను ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

న్యూస్‌రీల్

276 ఎంపీటీసీ స్థానాలు

తుది జాబితా ప్రకటించిన అధికారులు

సంగారెడ్డి జోన్: జిల్లాలో 276 ఎంపీటీసీ (మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ) స్థానాల తుది జాబితాను అధికారులు ప్రకటించారు. జిల్లాలో చౌటకూరుతోపాటు నిజాంపేట మండలాలు కొత్తగా ఏర్పడ్డాయి. ఆయా మండలాల్లో అదనంగా రెండు ఎంపీపీలతోపాటు జెడ్పీటీసీలు పెరిగాయి. గతంలో జిల్లాలో 295 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, 25 ఎంపీపీలు, జెడ్పీటీసీలు ఉన్నాయి. నూతనంగా ఏర్పడిన మండలాలు, గ్రామ పంచాయతీలు, పలు పాత గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీలలో విలీనం అయ్యాయి. ఫలితంగా జిల్లావ్యాప్తంగా ఉన్న వాటిలో ఎంపీటీసీల సంఖ్య 276కు చేరి, ఎంపీపీ, జెడ్పీటీసీల సంఖ్య 27కు చేరాయి. ఈనెల 2 వరకు ప్రకటించిన ముసాయిదా జాబితాలో ఎలాంటి అభ్యంతరాలు రాకపోవటంతో తుది జాబితాను ప్రకటించారు.

అటవీ ప్రాంతాన్ని సంరక్షించాలి: డీఎఫ్‌వో



స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్‌వో శ్రీధర్‌రావు

జిన్నారం (పటాన్‌చెరు): అటవీ ప్రాంతాన్ని సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అటవీశాఖ అధికారి శ్రీధర్‌రావు అధికారులకు సూచించారు. గుమ్మడిదల మండల పరిధిలో అటవీ ప్రాంతాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. బొంతపల్లి అర్బన్ పార్క్‌తోపాటు మంబాపూర్ ప్రాంతంలో పార్క్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

దేవాలయాభివృద్ధికి సహకారం: ఎమ్మెల్యే గూడెం



ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న నిర్వాహకులు

పటాన్‌చెరు టౌన్: దేవాలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు మండలం రామేశ్వరం బండ గ్రామ పరిధిలో మంగళవారం నిర్వహించిన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయం వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఆలయ నిర్మాణం కోసం తన తండ్రి కీర్తిశేషులు గూడెం సత్తిరెడ్డి జ్ఞాపకార్థం ఐదు గుంటల సొంత స్థలాన్ని అందజేయడంతో పాటు, రూ.20 లక్షల నిధులు అందజేశామన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఎంపీటీసీ అంతిరెడ్డి,గౌడ సంఘం సభ్యులు మల్లుగారి బాల్‌రాజ్‌గౌడ్, ధనరాజ్‌గౌడ్, పాండుగౌడ్, జగదీశ్వర్‌గౌడ్ ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వరకట్నం వేధింపులు... నవ వధువు ఆత్మహత్య



శ్రీజ(ఫైల్)

అనంతగిరి: వరకట్నం వేధింపులు భరించలేక పెళ్లైమూడు నెలలు కాకముందే ఓ నవ వధువు ఆత్మహత్య చేసుకుంది. వికారాబాద్ పట్టణంలోని సాకేత్‌నగర్‌లో మంగళవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. సాకేత్‌నగర్‌కు చెందిన సాయికి గతేడాది నవంబర్ 17న సంగారెడ్డి జిల్లా మునిపల్లికి చెందిన శ్రీజతో వివాహమైంది. పెళ్లి సమయంలో రూ.2 లక్షల నగదు, 12 తులాల బంగారం, బైక్ ఇచ్చారు. కొద్దిరోజుల అనంతరం మరో రూ.3లక్షలు అదనపు కట్నం తీసుకురావాలని సాయి వేధించడం మొదలు పెట్టాడు. ఇదే విషయాన్ని శ్రీజ తన కుటుంబసభ్యులకు ఫోన్ చేసి చెప్పింది. రోజురోజుకూ సాయి వేధింపులు ఎక్కువ కాగా తీవ్ర మనస్తాపం చెందిన శ్రీజ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి సుజాత ఫిర్యాదు మేరకు వికారాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి

న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్

సంగారెడ్డి టౌన్: ఆరోగ్యం పట్ల ప్రతీ ఒక్కరు తగిన జాగ్రత్త వహించాలని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి రమేశ్ సూచించారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మంగళవారం సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రిలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...క్యాన్సర్ వ్యాధికి ముందుగానే పరీక్షలు చేయించి జాగ్రత్తలు పాటిస్తే ఆ వ్యాధిని జయించవచ్చన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో గాయత్రీదేవి, డాక్టర్లు విద్యార్థులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు మెదక్ జిల్లా జట్టు



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు

మెదక్ మున్సిపాలిటీ: ఆదిలాబాద్ పట్టణంలో 4 నుంచి 7 వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా జట్టు మంగళవారం తరలివెళ్లినట్లు కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్, మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పీ. రమేశ్ వెల్లడించారు. మెదక్ జిల్లా జట్టుకు స్పోర్ట్స్ కిట్స్‌ను పాపన్నపేటకు చెందిన నరేందర్ గౌడ్ ఉచితంగా అందించారు. కెప్టెన్ ఆసిఫ్ ఆధ్వర్యంలో కోచ్ శ్రీకాంత్‌తోపాటు క్రీడాకారులు రాకేశ్, రామస్వామి, నితిన్, నిఖిల్, మేఘరాజు, శ్రీనివాస్, దేవేందర్, సిద్ధిరాములు, పాషా, వికాస్ రాజుతో పాటు మొత్తం 12 మంది క్రీడాకారులు వెళ్లారు.

స్టాక్ మార్కెట్ పేరుతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి బురిడీ

రూ.25 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

పటాన్‌చెరు టౌన్: నకిలీ స్టాక్ మార్కెట్ పేరిట సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి బురిడీ కొట్టించి భారీగా నగదు కాజేశారు. పోలీసుల కథనం మేరకు.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని హెచ్ఎంటీ స్వర్ణపురి కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి గతేడాది డిసెంబర్ 1న వాట్సాప్ ద్వారా స్టాక్ మార్కెట్‌కు సంబంధించిన మెసేజ్ వచ్చింది. ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేయగా నిర్వాహకులు ఓ ఐడీని క్రియేట్ చేసి ఇచ్చారు. బాధితుడు నగదు ఇన్వెస్ట్ చేస్తూ మొత్తం రూ.25 లక్షలు పెట్టుబడి పెట్టాడు. చివరగా తాను పెట్టిన నగదుతోపాటు లాభాలివ్వాలని అడుగగా అపరిచిత వ్యక్తి స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు, మంగళవారం అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు.

ప్రైవేట్ పెట్టుబడులకు పెద్దపీట: చుక్కా రాములు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: కేంద్ర బడ్జెట్‌లో ప్రైవేట్ పెట్టుబడులకు పెద్దపీట వేశారని ఇది దేశంలో అమలవుతున్న నయా ఉదారవాద విధానాల కొనసాగింపుగానే ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్కా రాములు పేర్కొన్నారు. కేవల్ కిషన్ భవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ప్రజల తలసరి ఆదాయాన్ని పెంచేందుకు బడ్జెట్‌లో ఎలాంటి ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు లేవన్నారు. మధ్యతరగతి కుటుంబాలకు రూ.12 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపు ఇవ్వడం వల్ల కొంత ప్రయోజనం చేకూరినప్పటికీ దానివల్ల కేంద్రానికి ఒక లక్ష కోట్ల ఆదాయం తగ్గనుందని వివరించారు.

ఫిరాయింపులపై నిర్లక్ష్యం తగదు

బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు పలువురు కాంగ్రెస్‌లో చేరిన వారిపై చర్యలు తీసుకునే విషయంలో స్పీకర్ నిర్లక్ష్యం తగదని చుక్కా పేర్కొన్నారు. సమావేశంలో సీపీఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అడివయ్యా, జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లేశం, రాజయ్య, మాణిక్యం,నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



కోహెడ మండలం కూరెల్ల గ్రామ శివారులో పచ్చని పొలాల్లో తాటివనం

కల్లు తిప్పకోలేని తాటి అందాలు

జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో ప్రత్యేక తాటివనాల ప్రాంతాలు ఉన్నాయి. సిద్దిపేట మండలం, నంగునూర్, చిన్నకోడూరు, కోహెడ మండలంలోని కూరెల్ల గ్రామంలో, హుస్నాబాద్ మండలంలోని పందిళ్ల, మద్దూర్, చేర్యాల, గజ్వేల్, దుబ్బాక మండలాల్లో తాటి వనాల్లో కల్లు గీస్తూ వేలాది మంది గీత కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ఈ తాటివనాలు పచ్చని పొలాల్లో మధ్యలో ఉండటంతో కల్లు ప్రియులను ఆకట్టుకుంటున్నాయి.





ఫొటోలు: స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

తాటివనంలో శోభయమానంగా దర్శనమిస్తున్న రేణుక ఎల్లమ్మ ఆలయం, తాటి చెట్టుపై కల్లు తీస్తున్న గౌడన్న

వంట మనిషి చెయ్యి పట్టి లాగాడని..

- చితకబాదిన తోటి లేబర్లు
- చికిత్స పొందుతూ సెంట్రింగ్ మేస్త్రీ మృతి



దీపక్ ఠాగూర్ మృతదేహం

పటాన్‌చెరు టౌన్: వంట మనిషి చెయ్యి పట్టి లాగాడని సెంట్రింగ్ మేస్త్రీని లేబర్లు చితకబాదడంతో మృతి చెందిన ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బీహార్‌కి చెందిన దీపక్ ఠాగూర్ (30) నాలుగు నెల కిందట బతుకుదెరువు కోసం వచ్చాడు. పటాన్‌చెరు మండలం నందిగామ పరిధిలోని మై ఫేర్ విల్లాస్‌లో సెంట్రింగ్ మేస్త్రీగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం రాత్రి మద్యం మత్తులో వెస్ట్ బెంగాల్‌కు చెందిన వంట మనిషి మాషారాణి చేయి పట్టి లాగడంతో ఆమెతోపాటు సంజయ్, సోప్‌దేవ్ సర్కార్, గోదంగా సన్యాసి మేస్త్రీని చితకబాదారు. తీవ్ర గాయాలైన అతడిని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. వంట మనిషితోపాటు ముగ్గురు లేబర్లపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇదేం రైతు శిక్షణ?

- లచ్చపేటలో అసంపూర్తిగా రైతు శిక్షణ కేంద్రం
- పదేళ్లయిన పూర్తికాని నిర్మాణం
- రూ.65 లక్షల నిధులతో ప్రారంభించి మధ్యలో వదిలేసిన వైనం
- ప్రారంభం కోసం రైతుల ఎదురుచూపు



అసంపూర్తిగా దర్శనమిస్తున్న రైతు శిక్షణ కేంద్రం

దుబ్బాకటౌన్: వ్యవసాయంలో నిత్యం ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడూ సలహాలు, సూచనలు ఇవ్వడంతోపాటు రైతులకు అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం నియోజకవర్గ స్థాయి రైతు శిక్షణ, విస్తరణ కేంద్రాన్ని నిర్మించాలని భావించింది. అందుకు అవసరమైన నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేటలో రైతు శిక్షణ కేంద్రం పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ అర్ధాంతరంగా వదిలేయడంతో పదేళ్లుగా అసంపూర్తిగానే దర్శనమిస్తోంది.

రూ.65 లక్షలతో ప్రారంభం

దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట 11వ వార్డులో 2014, అక్టోబర్‌లో మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా వ్యవసాయశాఖ ఏడీఏ కార్యాలయం సమీపంలో రైతుశిక్షణ, విస్తరణ కేంద్ర నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నాబార్డు సాయంతో రూ.65 లక్షలతో భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో మొదటి అంతస్తు తరహాలో మొదలు పెట్టిన కాంట్రాక్టర్ బేస్మెంట్, పిల్లరు వేసి, కింది అంతస్తు నిర్మించారు. పై అంతస్తుపై స్లాబ్ నిర్మించి వదిలేశాడు. సుమారు. రూ.25 లక్షల మేర పనులు పూర్తయ్యాయి. అనంతరం కాంట్రాక్టర్ అనారోగ్యానికి గురవడంతో అర్ధాంతరంగా పనులు ఆపేశాడు. దీంతో మంజూరైన రూ.40 లక్షల నాబార్డు నిధులు వెనక్కి వెళ్లాయి. పదేళ్లుగా అసంపూర్తిగా దర్శనమిస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు.

గడ్డి, ముళ్ల పొదలతో దర్శనం

రైతు శిక్షణ కేంద్రం పూర్తయి యువ రైతులకు వ్యవసాయ సాగుపై శిక్షణ ఇస్తే అధునాతన వ్యవసాయంపై అవగాహన పెరుగుతుందని పలువురు పేర్కొంటున్నారు. కానీ ప్రస్తుతం నిర్మాణం ఆగిపోయిన శిక్షణ కేంద్ర ప్రాంతమంతా గడ్డి, ముళ్ల పొదలతో దర్శనమిస్తోంది. ప్రస్తుత ప్రభుత్వమైనా అవసరమైన నిధులు మంజూరు చేసి భవన నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తే వందల మంది రైతులకు, పశుపోషకులకు మేలు జరుగుతుందని వాపోతున్నారు.

నిధులొస్తే మొదలు పెడుతాం



అసంపూర్తిగా ఉన్న రైతు శిక్షణ, విస్తరణ కేంద్ర నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తే మరో కాంట్రాక్టర్‌తో పనులు పూర్తయ్యేలా చర్యలు చేపడుతాం. కాంట్రాక్టర్ పనులు నిలిపివేయడంతో నిధులు వెనక్కి వెళ్లిపోతాయి.

– రిజ్వాన్, ఏఈపీఆర్, దుబ్బాక

ఉపాధి కల్పన లక్ష్యాలను మెరుగుపర్చుకోవాలి

- కలెక్టర్ రాహుల్ రాజ్
- జీవాల పెంపకంలో బ్రీడింగ్ షెడ్ పనులను పరిశీలన
- మహిళా రైతులకు సూచనలు, సలహాలు



హవేళిఘణాపూర్(మెదక్) : బీడింగ్ ఫారమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

హవేళిఘణాపూర్(మెదక్): ఉపాధి కల్పన లక్ష్యాలను మెరుగుపర్చుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ మహిళా రైతులకు సూచించారు. మెదక్ మండల పరిధిలోని బాలానగర్ గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జీవాల పెంపకంలో బ్రీడింగ్ ఫారమ్ షెడ్డు నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. యూనిట్ ఏర్పాటు ద్వారా రైతుకు ఆర్థికాభివృద్ధి చేకూర్చే, లాభ నష్టాలను, వ్యాపార లావాదేవీలను స్వయంగా మహిళా రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జీవాల పెంపకంలో బ్రీడింగ్ ఫారానికి మొదటి దశలో ఉన్న షెడ్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసుకొని యూనిట్ ప్రారంభించడానికి సిద్ధంగా ఉండాలన్నారు. రూ.కోటి వ్యయంతో ఈ యూనిట్ ప్రారంభించాల్సి ఉండగా, ఇందులో లబ్ధిదారుల వాటా రూ.10 లక్షలు కాగా, బ్యాంకు రుణం రూ.40 లక్షలు ఉంటుందన్నారు. యూనిట్ సబ్సిడీ కింద రూ.50 లక్షలు లభిస్తుందన్నారు. 500 గొర్రెలు లేదా మేకలు, 35 పొట్టేళ్లు, మేక పోతులతో కూడిన బ్రీడింగ్ ఫారమ్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వారికి 'నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ స్కీమ్' ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద కేంద్ర ప్రభుత్వం రుణ సదుపాయం కల్పించిందన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటయ్య, డాక్టర్లు లక్ష్మణ్, వినోద్, సంబంధిత అధికారులు, మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన బోధన అందించాలి

మెదక్‌జోన్: విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆధునిక సౌకర్యాలతో విద్యాబోధన చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. మంగళవారం మెదక్ పిల్లికొటాల్ శివారులో కొనసాగుతున్న మెడికల్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి బోధన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెడికల్ కళాశాల క్యాంటీన్ నిర్వహణ, ల్యాబ్ నిర్వహణ, హాస్టల్ వసతుల గురించి ప్రిన్సిపాల్ రవీంద్ర కుమార్‌ను ఆరా తీశారు. కలెక్టర్ వెంట వైస్ ప్రిన్సిపాల్ జయ, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ శివదయాళ్, బోధన సిబ్బంది ఉన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



రూప్ లాల్ (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన మండల పరిధి నవాబుపేట పంచాయతీ రాములు తండాలో చోటు చేసుకుంది. ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన రూప్ లాల్(50) సోమవారం వ్యవసాయ బోరు మోటార్ ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి పడిపోయాడు. గుర్తించిన తోటి రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతోపాటు నూరారంలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పొలంలో పడి యువ రైతు



నర్సింహులు(ఫైల్)

చేగుంట(తూప్రాన్): పొలంలో పడి యువ రైతు మృతి చెందిన ఘటన చేగుంట మండలం రెడ్డిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డిపల్లి గ్రామానికి చెందిన ముప్పిడి నర్సింహులు(35) వరి పంట సాగు చేస్తున్నాడు. కలుపుతీసిన పంటకు యూరియా చల్లుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు పొలంలో పడి పోయి ఊపిరాడక మృతి చెందాడు. మృతుడికి భార్య అనురాధ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జీవితంపై విరక్తితో ఉరేసుకొని ఆత్మహత్య



బాబు (ఫైల్)

వర్గల్(గజ్వేల్): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం రాత్రి వర్గల్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు.. వర్గల్‌కు చెందిన కొమ్ము బాబు(38)కు భార్య భాగ్య, పన్నెండేళ్లలోపు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. వ్యవసాయం చేసుకునే బాబు కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఇతరుల వద్ద అప్పులు చేస్తూ మద్యం తాగుతుండేవాడు. ఆదివారం ఇదే విషయమై అప్పులు ఎలా కడతావని, తాగుడు మానాలని భార్య మందలించింది. దీంతో జీవితంపై విరక్తి చెంది బాబు వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అన్న కొడుకే ప్రధాన నిందితుడు?

హత్య కేసును ఛేదించిన పోలీసులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి సామ్య తండాలో దారుణ హత్యకు గురైన మదన్‌లాల్‌కు సంబంధించి కీలక నిందితులను పోలీసులు గుర్తించారు. మృతుడి అన్న కొడుకే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. తండాకు చెందిన మదన్‌లాల్‌ను శనివారం రాత్రి ఇంట్లో కత్తితో పొడిచి హత్య చేయగా ఆదివారం సాయంత్రం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లతో పరిశీలించినప్పటికీ ఎలాంటి క్లూస్ లభించలేదు. హత్య కేసును ఛాలెంజ్‌గా తీసుకున్న తూప్రాన్ సీఐ రంగాకృష్ణ, ఎస్ఐ మధుకర్ రెడ్డి, మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్‌గౌడ్ అన్ని కోణాల్లో కేసు ముమ్మరంగా విచారణ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు మృతుడి అన్న కొడుకే హత్య చేసినట్లు గుర్తించారు. అతడితోపాటు హత్యకు మరో వ్యక్తి సహకరించగా అతడిని కూడా అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని సీఐ రంగాకృష్ణ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు



నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

జహీరాబాద్ టౌన్: అక్రమంగా ఎండు గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ శాఖ పోలీసులు సోమవారం రాత్రి పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జహీరాబాద్ పట్టణంలోని అహ్మద్‌నగర్‌కు చెందిన ఎండీ. సోఫియాన్, ఎండీ రఫీ ఎండు గంజాయిని తీసుకొని బీదర్ నుంచి హైదరాబాద్ వైపు బైక్‌పై వెళ్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐలు హన్మంత్, అనుదీప్, కానిస్టేబుళ్లు అరుణజ్యోతి, అంజిరెడ్డి, రాజేశ్, శ్రీకాంత్ అల్లాన రోడ్డు వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. వీరి బైక్‌ను ఆపి తనిఖీ చేయగా 220 గ్రాముల ఎండు గంజాయి దొరికింది. గంజాయితోపాటు బైక్‌ను స్వాధీనం చేసుకొని జహీరాబాద్ ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలీసుల అదుపులో గుట్కా విక్రేతలు



గుట్కాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

సంగారెడ్డి క్రైమ్: గుట్కా విక్రేతలను పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ ఎస్సై సర్దార్ కథనం మేరకు.. పట్టణంలోని రాజ్యంపేట్‌కు చెందిన ఖాదీర్, మంజీరానగర్‌కు చెందిన ధన్‌రాజ్ పట్టణంలోని బైపాస్ రోడ్డులో పలు చోట్ల నిషేధిత గుట్కా మసాలాలను అమ్ముతున్నారు. సోమవారం పట్టణ పోలీస్‌లు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని వారి వద్ద నుంచి దాదాపు 400 ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.5,400 నుంచి రూ.6,000 వరకు ఉంటుందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నర్సాపూర్ రూరల్: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని రామచంద్రాపూర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. నర్సాపూర్ ఎస్సై లింగం కథనం మేరకు.. రామచంద్రాపూర్ గ్రామానికి చెందిన దండు సత్తయ్య (63) తరచూ అనారోగ్యంతో బాధపడుతూ గత నెల 24న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదే రోజు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆ కార్మికుడి తొలగింపు సబబే

- క్రమశిక్షణారాహిత్యం సరికాదన్న హైకోర్టు
- 'ఎంఆర్ఎఫ్' నిర్ణయం సమర్థనీయమేనని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: క్రమశిక్షణారాహిత్యానికి పాల్పడిన కార్మికుడి తొలగింపు సబబేనని హైకోర్టు అభిప్రాయపడింది. ఎంఆర్ఎఫ్ లిమిటెడ్ తీరును సమర్థించింది. చర్యలు తీసుకోకుంటే ఇతర కార్మికులు కూడా క్రమశిక్షణారాహిత్యానికి పాల్పడే అవకాశం ఉందని వ్యాఖ్యానించింది. తీసేసిన కార్మికుడిని మళ్లీ ఉద్యోగం ఇవ్వాలని ఆదేశిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను తప్పుబట్టింది. ఆ తీర్పును రద్దు చేసింది. క్షమశిక్షణ పాటించని వారిని విధుల్లో కొనసాగనిస్తే.. అక్కడి పని వాతావరణం దెబ్బతింటుందని స్పష్టం చేసింది. మెదక్ జిల్లాకు చెందిన పీ సంగమేశ్వర్ ఎంఆర్ఎఫ్‌లో ఉద్యోగిగా పనిచేస్తూ.. సూపర్‌వైజర్‌పై చేయి చేసుకున్నారు. విచారణ జరిపిన సంస్థ అతన్ని విధుల నుంచి తొలగించింది. సంగమేశ్వర్ లేబర్ కోర్టును ఆశ్రయించగా, ఆశించిన ఉత్తర్వులు వెలువడలేదు. దీంతో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. సంగమేశ్వర్‌ను విధుల్లోకి తీసుకోవాలని తీర్పునిచ్చారు. అలాగే తీసేసిన నాటి నుంచి తిరిగి విధుల్లోకి తీసుకునే వరకు ప్రయోజనాలు ఇవ్వాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. దీన్ని సవాల్ చేస్తూ సంగమేశ్వర్, ఎంఆర్ఎఫ్ వేర్వేరుగా అప్పీల్ వేశాయి. అప్పీల్‌పై జస్టిస్ అభినంద్‌కుమార్, జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి ధర్మాసనం విచారణ చేపట్టి తీర్పునిచ్చింది. కార్మికుడి వాదనను తప్పుబడుతూ, సూపర్‌వైజర్‌పై దాడి సరికాదంది. తొలగించిన కార్మికుడిపై ఇప్పటికీ ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొంది. కార్మికుడిని విధుల్లోకి తీసుకుంటే సూపర్‌వైజర్ ప్రశాంతంగా విధులు నిర్వహించే పరిస్థితి ఉండదని అభిప్రాయపడింది.

జిన్నింగ్ మిల్లులో అగ్ని ప్రమాదం

- సుమారు రూ.1.5 కోట్ల నష్టం
- అందోల్ మండలం ఎర్రారం గ్రామ శివారులో ఘటన



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

వట్‌పల్లి(అందోల్): జిన్నింగ్ మిల్లులో ఆకస్మికంగా మంటలు చెలరేగి పత్తి అగ్నికి ఆహుతైన ఘటన సంగారెడ్డి జిల్లా అందోలు మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఎర్రారం గ్రామ శివారులోని వైభవ్ ముర్గన్ ఆగ్రోటెక్ ఇండస్ట్రీస్‌లో ఓ యంత్రంలో నుంచి నిప్పు రవ్వలు చెలరేగి యంత్రాలన్నింటికీ వ్యాపించి మిల్లులో ఉన్న పత్తి బేళ్లకు అంటుకుంది. వెంటనే మిల్లు యాజమాన్యం ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా అక్కడికి చేరుకొని జేసీబీల సహాయంతో పత్తి బేళ్లను బయటకు తీసి మంటలార్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ బేళ్లు సగానికి పైగా మంటలకు తగలబడి పోయాయి. దీంతో రూ.1.5 కోట్ల నష్టం వాటిల్లిందని మిల్లు యజమానులు భాస్కర్, శంకర్ గుప్తా తెలిపారు. మూడు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకురావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మిల్లు యాజమాన్యం జోగిపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

మునిపల్లి(అందోల్): ఆటో బోల్తా పడి పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని మగ్దుంపల్లి గ్రామ శివారు 65వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కంకోల్ నుంచి జహీరాబాద్ వైపు వెళ్తున్న బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో వాహనదారుడు కింద పడ్డాడు. ఆ వ్యక్తిని తప్పించబోయి వెనుకాల వస్తున్న ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో జహీరాబాద్ ఆస్పత్రికి తరలించారు.